# కవితా కౌముది

## ఆత్మీయ స్పర్శ

రవిప్రసాద్ చెలమల్లు

సూరీడు కిరణాలై,
మేఘాలు చినుకులై
పుడమిని తాకితేనే
జీవన గమనం సాగుతుంది
కనిపించని గాలి కూడా
మేను తాకి ఉనికి చాటుతుంది

జీవం లేని జ్ఞాపకం కూడా
తడిమితే చాలు
కథలు కథలుగా వినపడుతుంది
తాకితేనే తెలుస్తుంది
తనేమిటో, తానేమిటో, తపనేమిటో !?





పెదవుల తడి నుదుటన అద్దితేనే
మనసుకు మురిపెం తెలుస్తుంది
రేగుతున్న గాయాలకి,కన్నీరొలికే కళ్లకు
స్నేహ హస్తాన్ని మించిన
సాంత్వన ఎక్కడ ఎదురవుతుంది

చేయి చేయి కలిపి నడిస్తేనే
చెలిమి చిక్కనైనట్లు
పాదం తాకిన తరువాతే
రాయి కాదు అహల్యని తెలిసినట్లు
బంధంలో గాఢత, సహచర్యంలో సామీప్యం
తాకి చూస్తేనే తేటతెల్లమవుతుంది!!!

★★★

# మాట స్పర్శ

## శ్రీసాహితి

నన్ను నేను ఇప్పటికే
నీ గురించే
అడుగుతాను..

నా పాత అడుగులతో
కలసి కొత్త చేతలు
ఎలా గడుపుతున్నాయని

చిలుము పట్టినా సరే
తొలి మాటలోని
స్పర్శకు జీవం ఉందొని?

ఏ క్షణం నీవు కురిసినా
పారె భావనలతో
గుండె కొలను నింపుకుని

నా నమ్మకాన్ని
నేను నీలో చూస్తూ
ఊపిరిని శుభ్రం చేసుకుంటాను.

★★★



# వాన వెలిసింది

## మల్లారెడ్డి మురళీ మోహన్

వాన వెలిసింది
అతిథులంతా ఒక్కసారిగా
ఇంటిని ఖాళీచేసి
వెళ్లిపోయినట్టుంది

వాన వెలిసింది
బయట చెట్ల మీదా
నేల మీద మాత్రమే కాదు,
లోలోనా తడి తగిలింది

వాన వెలిసింది
వానని తప్పించుకోలేక తడిసిన గాలి
నీటిఆత్మలా మారి
దేహాల్ని చుట్టుకుంది, ఆత్మీయంగా

వాన వెలిసింది
తడవలేకపోయిన చిల్లుల గొడుగు
విచ్చుకోని నల్ల కలువలా
తన బీదలికానికి కుమిలిపోతోంది

వాన వెలిసింది
ఎండగాయాలకు
మందు పూసుకున్నట్టు
మట్టి వింత వాసనలు చిమ్ముతోంది

వాన వెలిసింది
'మళ్ళీ ఎప్పుడు?' అన్న ప్రశ్న
చూరుమించి జారుతోన్న
ఆఖరి వర్షబిందువుని
చుట్టుకుని దోసిట్లో రాలింది. ★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఇంతకాలము నీకొరకెదురు చూసి
యలసిపోయితి నీ జాడ తెలియలేక
ఏల నా కొరకొకపరి యిటకు రావు?
నన్ను మరవలేవంచును నాకు తెలియు

తెలియనేర నీ త్యాగమ్ము దేని కొరకొ
త్యాగమో నీదు కాళ్ళ బంధనములేమొ!
అడుగు ముందుకు వైచి వెన్కడుగదేల?
మనల బంధమున్ మించు బంధనమదేమి?

సఖుని చెంతకు చేర సంశయమదేమి?
ప్రేమతో వచ్చి నిన్ను పరిగ్రహింప
కదలి సాగని నా యశక్తత యిదేమి?
బాధ్యులెవ్వరీ ప్రేమ వైఫల్యమునకు?

కలలు కందును చెలిమి కావలయునంచు
పొందుటెట్టులో తెలియక పొగులుచుందు
ప్రేమ హృదయమ్ములోనంకురించినపుడు
తరలిపోవును తెలివి మస్తకమునుండి

పాలిపోవకుమో ప్రేమపావురమ్మ!
చెంతనే యుండి తీర్చు నా చింత నీవు
చెప్పుకొనుటకు తెమ్ము నా చెలియనిటకు
తోడునొసగు నా కన్నీరు తుడుచుటకును

COMMENTS